క్లుప్తంగా

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధి వారిలంకలో వెలసిన ధనమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలుగా వెలుగొందుతున్న ధనమ్మ మర్రిలో భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. కపిలేశ్వరపురంతో పాటు ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట, అయినవిల్లి మండలాల్లోని గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

'కోట' మృతికి ఎమ్మెల్సీ తోట సంతాపం

కపిలేశ్వరపురం: విలక్షణ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదివారం సంతాపాన్ని వ్యక్తం చేశారు. నటనా నైపుణ్యంతో పాటు సామాజిక అంశాల పట్ల విశేషమైన అవగాహన ఉన్న వ్యక్తిగా కోట శ్రీనివాసరావు వెలుగొందారన్నారు. భౌతికంగా దూరమైనా ఆయన నటనా చాతుర్యంతో కూడిన సినిమాలతో జనంలో జీవించే ఉంటారని ఎమ్మెల్సీ తోట అన్నారు.

కోట మృతికి బ్రాహ్మణ సంఘం సంతాపం

కపిలేశ్వరపురం (మండపేట): సీనియర్ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి మండపేట పట్టణ బ్రాహ్మణ సేవా సంఘం సంతాపాన్ని వ్యక్తం చేశారు. సినీ నటుడిగా, సామాజిక విశ్లేషకుడిగా, ప్రజాప్రతినిధిగా నటనతో పాటు జీవితంలోనూ విలక్షణ ప్రతిభను చాటారని సంఘం నాయకులు కడియాల ప్రసాద్, కేసరి విద్యాసాగర్, శివకోటి శేష శివ సుబ్రహ్మణ్యం, ఏడిద సూర్యనారాయణ, కొండూరి భాస్కరకామరాజు అన్నారు.

16న మండపేట కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): ఈ నెల 16న మండపేట మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుందన్నారు. కౌన్సిల్‌లో ఖాళీగా ఉన్న మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తిని కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక ప్రక్రియ నిమిత్తం సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కో ఆప్షన్ స్థానానికి షేక్ ఇబ్రహీం ఒక్కరే దరఖాస్తు చేసుకున్నారని, దీనిపై నిర్ణయం తీసుకునేందుకు కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు చైర్‌పర్సన్ తెలిపారు.

కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందించాలి

కాజులూరు: సేద్యం చేసే కౌలు రైతులందరికీ రుణ అర్హత కార్డులు అందించాలని జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి వలు రాజబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మంజేరు, చేదువాడ, తిప్పరాజుపాలెం, అయితపూడి తదితర గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించారు. ఇప్పటికే కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వడం చాలా ఆలస్యమైందని రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలో 6,200 మందికి కౌలు రైతులు గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 1,200 కౌలు గుర్తింపు కార్డులు మాత్రమే అందించారన్నారు. గత సంవత్సరం 3,000 వరకు కౌలు గుర్తింపు కార్డులు జారీ చేశారని ఈ ఏడాది నేటికీ అన్ని కార్డులు కూడా ఇవ్వలేకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సేద్యం చేసే ప్రతి కౌలు రైతుకు రుణ అర్హత కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నల్లూరులో రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని నల్లూరులో 15న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు ఆదివారం తెలిపారు. అంగర విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరాను నిలిపివేయనున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని రత్నాలరావు కోరారు.

ధన ధాన్యలక్ష్మి ఆలయంలో చోరీ



ఆలయం వెలుపల గోడకు కన్నం వేసి చోరీ చేసిన దుండగులు


కె.గంగవరం: మండల పరిధిలోని కోట గ్రామంలో గల ధన ధాన్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ మేరకు ఆలయ పూజారి పెనుమత్స హరినాథ రాజు కె.గంగవరం పోలీసులకు ఘటనపై ఆదివారం ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి గుడి శుభ్రం చేసి తాళాలు వేసి పూజారి ఇంటికి వెళ్లి, తిరిగి ఉదయం ఆలయం వద్దకు వచ్చే సరికి ఆలయం వెలుపల గోడ బద్దలు కొట్టి ఉండడంతో అనుమానం వచ్చి గ్రామస్తులతో కలసి ఆలయం లోపలకు వెళ్లి చూడగా చోరీ జరిగినట్టు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో అమ్మవారికి చెందిన ముక్కపుడకలు, శతమానాలు, అమ్మవారి మెడలో ఉన్న కంఠ భరణం, కాసుల పేరుతో పాటు బీరువాలో ఉన్న నగదు పోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కె.గంగవరం ఎస్సై జానీ భాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పాములతో..జర జాగ్రత్త

- బుస కొడుతున్న విష సర్పాలు
- అప్రమత్తతే అత్యవసరం
- అందుబాటులో స్నేక్ వీనమ్ ఇంజెక్షన్లు



తాచుపాము



స్నేక్ వీనమ్ యాంటీ సీరమ్ ఇంజెక్షన్

రామచంద్రపురం: జిల్లా వ్యాప్తంగా పాము కాటు బాధితుల సంఖ్య పెరుగుతుంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్న పాము కాటుతో ప్రాణాపాయం సంభవిస్తుంది. ముఖ్యంగా రైతులు, కూలీలు, ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన వేళ వర్షాలు కురుస్తుండటంతో విషసర్పాలు బయటకు వస్తుండటమే దీనికి కారణం. కోనసీమలో తాచు, కట్లపాము, రక్తపింజరి, తదితర విషపూరిత పాములు ఎక్కువగా ఉంటాయి. వాటి కాటుకు గురైన భాదితులకు వెంటనే వైద్యం అందకపోతే ఒక్కోసారి ప్రాణాలు పోయే ఘటనలు కూడా ఉన్నాయి. మండపేట, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రులతో పాటు ఆయా నియోకవర్గాల్లో పీహెచ్‌సీల పరిధిలో పాము కాటుకు చికిత్సను అందిస్తున్నారు. గత 30రోజుల కాలంలో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి పరిధిలో సుమారుగా 45 మంది వివిధ రకాల విషసర్పాల కాటుకు గురయ్యారు. తగిన సమయంలో ఆసుపత్రికి తీసుకు వచ్చి స్నేక్ వీనమ్ యాంటీసిరమ్ అందించటంతో ఎవ్వరికి ప్రాణాపాయం కలగలేదు.

సమయమే కీలకం

పాము కాటుకు గురైనప్పుడు వీలైనంత త్వరగా ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణపాయం నుంచి బయటపడవచ్చు. కానీ కొందరు పసర మందు, నాటు వైద్యం పేరిట ప్రమాదాన్ని మరింత మీదకు తెచ్చుకుంటున్నారు. మరోపక్క ప్రభుత్వాసుపత్రుల్లో పాము కాటుకు విరుగుడు ఇంజెక్షన్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నా గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు బాధితుల ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పట్టణాల్లోని వైద్యశాలలకు వెళ్తున్నారు. ఆ క్రమంలో సకాలంలో వైద్యం అందక కొందరు మృత్యువాత పడుతున్నారు. పాములు సీజన్ కావటంతో ఆసుపత్రులోను, పీహెచ్‌సీ పరిధిలోను స్నేక్ వీనమ్ యాంటి సెరమ్ ఇంజెక్షన్లను వైద్య ఆరోగ్య శాఖ అందుబాటులో ఉంచారు. దీంతో పాము కాటుకు గురైన వ్యక్తులు సరైన సమయంలో ఆసుపత్రులకు చేరటంతో ప్రాణాపాయం నుంచి తప్పుకుని తగిన సమయంలో చికిత్సను వైద్యులు అందిస్తున్నారు.

తస్మాత్ జాగ్రత్త..

పొలం గట్లు, కాలువ గట్లు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, పొదలు, గడ్డివాములు, పాడుబడ్డ ఇళ్లు, ఇటుక గుట్టలు, పేర్చిన కట్టెలు, పెంట దిబ్బల్లో విషపురుగులు, పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఆహారం కోసం రాత్రి సమయాల్లో బయటకు వచ్చే ఎలుకలు, బల్లులు, తొండలను పట్టుకుని తినేందుకు పాములు వేటకు వస్తాయి. ఇలాంటి ప్రాణులు ఎక్కడ ఎక్కువగా సంచరిస్తాయో అక్కడ పాములు కూడా తిష్టవేస్తాయి. పాములకు చెవులు ఉండవు కాబట్టి వాటి శరీరం కింద భాగంలో ఉండే ప్రత్యేక పొలుసుల ద్వారా శబ్ద ప్రకంపనలను గ్రహించి సంచరిస్తుంటాయి. వేడి రక్తం ప్రవహించే జంతువులు, మనుషులు, సమీపిస్తే వెంటనే గుర్తించి కాటు వేస్తాయి.

ఇవి తప్పనిసరి

రాత్రి సమయంలో పొలాల్లో తిరిగే వాళ్లు, అక్కడే నిద్రించే వారు వెంట టార్చిలైట్లు ఉంచుకోవాలి. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పెట్రోల్, కిరోసిన్, వెల్లుల్లి, వాసనలను పాములు భరించలేవు. పాములు ఎక్కువగా ఉండే చోట సమయానుకూలంగా వీటిని ఉపయోగించాలి. రాత్రి సమయంలో పొలాలు, గడ్డివాములల్లో రోజు తిరిగే రైతులు, కూలీలు, మోకాళ్ల దాకా రబ్బరు బూట్లు ధరించటం మంచింది. గడ్డిలో పని చేసే వారు చేతికి రబ్బరు తొడుగులు తొడగాలి. ఇల్లు, కార్యాలయాలు పాఠశాలల వద్ద పొదలు లేకుండా చూసుకోవాలి. సాధారణంగా కాటు వేసిన పాము అంతకు ముందు ఆహారం తీసుకున్నా, మరో జీవిని కాటు వేసినా, విషయం తీవ్రత తక్కువగా ఉంటుంది.

> **కాలయాపన చేయరాదు**
>
> 
>
> - పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళనకు గురికాకుండా చూడాలి. పక్కన ఎవరైనా ఉంటే భాదితులకు ధైరం చెప్పాలి.
> - కాటు వేసిన పై భాగంలో వెంటనే తాడు, గుడ్డ పీలికలతో కొంత శరీరాన్ని రక్తం అందకుండా బిగించి కట్టాలి. కాటు వేసిన శరీర భాగంతో పదునైన బ్లేడుతో గాయం చేసి రక్తం కారనివ్వాలి. పాము కాటుకు గురైన వ్యక్తిని నడిపించరాదు. పరుగు పెట్టించవద్దు.
> - కాలయాపన చేయకుండా తక్షణమే సమీప ఆసుపత్రికి తరలించాలి. ప్రస్తుతం ఆసుపత్రుల్లో స్నేక్ వీనమ్ యాంటి సిరమ్ అందుబాటులో ఉన్నాయి.
>
> – డాక్టర్ ఎస్ ప్రవీణ్‌కుమార్, సూపరింటిండెంట్ ఏరియా ఆసుపత్రి రామచంద్రపురం

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



కపిలేశ్వరపురంలో వరద నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కపిలేశ్వరపురం: గౌతమి గోదావరి నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి ఎడమ, కుడి గట్లు పరిధి గ్రామాల్లోని పుష్కర ఘాట్లను వరదనీరు తాకింది. తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని రెవెన్యూ, పంచాయతీరాజ్, గోదావరి హెడ్ వర్క్స్ శాఖల అధికారులు, సిబ్బంది ఆదివారం గోదావరి వరద పరిస్థితిని సమీక్షించారు. కపిలేశ్వరపురం పుష్కర ఘాట్ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. కేదారిలంక, వీధివారి లంక, నారాయణలంక, పల్లపులంకలోని ప్రజలను అప్రమత్తం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు చేశారు. ఆలయ అర్చక బృందం సభ్యులు స్వామిని విశేషంగా అలంకరించారు. తెల్లవారు జామున స్వామికి పంచామృతాభిషేకం పూజలు చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతినిచ్చారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన



తామరపల్లి శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కె.గంగవరం: మండల పరిధిలోని తామరపల్లి, దంగేరు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. తామరపల్లి గ్రామానికి చెందిన గోలి సూర్యనారాయణ, రామసీత దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గోలి సత్యనారాయణ మూర్తి, సీతారత్నం, డాక్టర్ గోలి మాణిక్య వెంకట కాశీరాం, డాక్టర్ శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం నిర్వహించారు. ప్రముఖ ఊపిరితిత్తుల ప్రత్యేక వైద్య నిపుణులు కిడ్నీ స్పెషలిస్ట్ బెల్లంకొండ రాజశేఖర్ తదితర వైద్యులు ఉచితంగా 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ తోకల మంగ, వైఎస్సార్ సీపీ నాయకులు తోకల శ్రీను, గ్రామ పెద్దలు గన్ని శ్రీను, నెక్కింటి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దంగేరులో..

గ్రామంలో ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ద్రాక్షారామంకు చెందిన కిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది గ్రామస్తులతో పాట చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన సుమారు 150 మంది కంటి రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, గ్రామ పెద్దలు పోలిశెట్టి నాగేశ్వరరావు, సిబ్బంది శివ తదతరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని శ్రీ పీవీఆర్ హైస్కూల్‌లో 1989–90 సంవత్సరంలో 10 వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తరువాత ఆదివారం కలుసుకుని సందడి చేశారు. ద్రాక్షారామంలోని హైస్కూల్ అవరణలో సరస్వతీ మాత విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు, అనంతరం వెంకటాయపాలెంలోని పేపకాయల బాబ్జీ కల్యాణ మండపంలో కుటుంబ సమేతంగా హజరయ్యారు. బాల్యంలో తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించుకున్నారు. తమతో కలసి చదవుకుని అకాల మరణం చెందిన 15 మంది స్నేహితులను గుర్తు చేసుకుని మౌనం పాటించి వారికి నివాళులర్పించారు. అనంతరం చిన్ననాటి విశేషాలను కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలసి పంచుకున్నారు. ఎవరైనా ఇబ్బందులు పడుతుంటే అంతా కలసి వారిని ఆదుకోవాలని కార్యాచరణ రూపొందించుకున్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీ అధినేతలుగా స్థిరపడిన రమేష్, భాగవతి గోపిలు ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి రావడంతో హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న నాగిరెడ్డి సతీష్, టేకుమూడి సత్యనారాయణ, తోట పుండరీకాక్షుడు, యండమూరి ఈశ్వరరావు, సంగీతం రామకృష్ణ, పంపన గోవిందు, రాజేశ్వరి, ధనలక్ష్మి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆలయ అసిస్టెంట్‌పై భక్తుల ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ ఈఓ, దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ కార్యక్రమంలో వివాదం చేలరిగింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు, పట్టణానికి చెందిన స్వీట్ షాపు యజమాని కంచెర్ల చక్రధరుడు (చక్రి) విలేకరులకు తెలిపారు. తాను సుమారు 150 కేజీల వివిధ రకాల స్వీట్లు సారెగా అమ్మవారికి సమర్పించానని, పట్టణానికి చెందిన మరో స్వీటు షాపు యజమానురాలు అయిన దూడల విజయలక్ష్మి తనతో పాటు బెల్లం మిఠాయిలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం అందులో 6 మిఠాయిలు అమ్మవారి ప్రసాదంగా ఆమె స్వీకరించిందన్నారు. ఈ క్రమంలో వెంకన్నబాబు ఆమెపై కేకలు వేయగా తానే ఆమెకు ప్రసాదంగా ఇచ్చినట్లు ఆయనకు తెలిపానని చక్రి పేర్కొన్నారు. లడ్డులు ఇవ్వడానికి నువ్వు ఎవరివీ, తీసుకోవడానికి ఆమె ఎవరు అంటూ, నువ్వు గుడికి ఎందుకు వస్తున్నావో నాకు తెలుసు అంటూ అవమానకరంగా మాట్లాడారన్నారు. దీనితో చిన్నబుచ్చుకున్న మహిళ కన్నీటితో మిఠాయిలను వెనుకకు ఇచ్చి ఆలయం నుంచి వెళ్లిపోయారని తమపై దురుసుగా ప్రవర్తించిన ఆలయ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్‌కు ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. దీనిపై ఎస్సై వివరణ కోరగా ఇరు పక్షాలు తమకు ఫిర్యాదు చేశారని కాని కేసులు నమోదు చేయలేదన్నారు.

నామవానిపాలెం సర్పంచ్ మృతి



సర్పంచ్, భూపతి రాజు వెంకట సూర్యనారాయణ రాజు (ఫైల్)

కాజులూరు: నామవానిపాలెం గ్రామ సర్పంచ్ భూపతిరాజు వెంకట సూర్యనారాయణరాజు (65,) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు ఉదయాన్నే పొలానికి వెళ్లి గుండె నొప్పిగా ఉందని ఇంటికి తిరిగి వచ్చి అపస్మారకస్థితికి చేరుకున్నారన్నారు. వెంటనే కుటుంబ సభ్యులు యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని బంధుమిత్రులు తెలిపారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత రెండు పర్యాయాలు గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దివంగత లోక్‌సభ స్పీకర్ బాలయోగికి బాల్యమిత్రుడు కాగా, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావుకు కుడి భుజంగా వ్యవహరించేవారు. అనంతరం వైఎస్సార్ సీపీలో చేరినప్పటికీ మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రస్తుతం కుటమి నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు తరలివచ్చి నివాళులర్పించారు.

ఆత్మరక్షణకు తైక్వాండో అవసరం



అంబాజీపేటలో జరిగిన తైక్వాండో గ్రేడ్ టెస్ట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

అంబాజీపేట: ఆత్మరక్షణతో పాటు మానసికోల్లాసానికి తైక్వాండో ఎంతో అవసరమని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తైక్వాండో కార్యదర్శి, బ్లాక్ బెల్ట్ ఎగ్జామినర్ బి.అర్జునరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టు శ్రీనివాస తైక్వాండో క్లబ్ చీఫ్ కోచ్‌కోచ్ పితాని త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ గ్రేడింగ్ టెస్ట్‌లో జిల్లా నుంచి 130 మంది క్రీడాకారులు గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొన్నారు. అర్జునరావుతో పాటు సీనియర్ కోచ్ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో 120 మంది బెల్ట్ గ్రేడింగ్ పొందారు. ఈ పోటీలలో అంబాజీపేట, రాజోలు, ముంగండ, ఇరుసుమండ, అమలాపురం తైక్వాండో క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు పితాని భార్గవి శ్రీకళ, పి.నాగభూషణం, కె.మణికంఠ, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరం నిర్వహణ అభినందనీయం

కొత్తపేట: ఉచిత వైద్య, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆరు జిల్లాలు) ఎస్పీ డాక్టర్ కొండా నరసింహారావు అన్నారు. స్థానిక వెంకట సందీప్ 'ఐ' క్లినిక్ ప్రాథమిక కంటి ఆసుపత్రి వద్ద ఆదివారం ఫ్రీ 'బోన్ మినరల్ డెన్సిటీ' అండ్ 'ఐ' క్యాంపు నిర్వహించారు. సందీప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండారు పెదవెర్రియ్య (చిట్టిబాబు) – సత్యవేణి దంపతుల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం యూనివర్సల్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎస్పీ నరసింహారావు ప్రారంభించారు. ఎముకలు, కీళ్ల వ్యాధుల వైద్య నిపుణులు రాజేంద్రబాబు ఆరుమిల్లి సేవలందించారు. డాక్టర్ అఖిల కంటి పరీక్షలు నిర్వహించారు.

ఉచితంగా టీకాలు

- టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ
- ప్రతి శని, బుధవారాల్లో ఉచితంగా టీకాలు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న వైద్యులు



పామర్రు సబ్ సెంటర్‌లో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్ ఫొటో)



పాణింగపల్లి సబ్ సెంటర్‌లో టీకాలు వేస్తున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

కె.గంగవరం: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో ఆయా టీకాలు, వ్యాక్సిన్లు వేయిస్తే వ్యాధులు దరిచేరకుండా జీవితాంతం ఆరోగ్యకమైన జీవితం గడపవచ్చు. అయితే చాలా మంది ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు టీకాలపై సరైన అవగాహన లేక వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలకు సరైన అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వసుపత్రుల్లోనూ ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధినిరోధక టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్లు ఇలా..

గర్భిణిగా నిర్ధారణ అయిన 3 నెలలు నిండిన తరువాత టీటీ ఇంజెక్షన్ వేయాలి. నెల రోజుల వ్యవధిలో మరో టటీ ఇంజెక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్, పోలిక్, కాల్షియం టాబెట్లు ఇస్తారు.

ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్లు ఇస్తారు. అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హైపటైటిస్–బి డోస్ వేయాలి. వీటి వల్ల పొలియో, పచ్చకామర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.

- 4 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- 6, 14 వారాలో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితో పాటు 6,10,14 వారాల వ్యవధిలో పొలియో చుక్కలు, పెంటావలెంట్ వేయించాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠ సర్పి, ధనుర్వాతం, మొదడు వాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- 9 నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోస్ టీపీటీ, మీజిల్స్, విటమిన్–ఏ ఓపీని వేయించాలి.
- 5 ఏళ్ల పూర్తయిన తరువాత టీపీటీ డోస్ వేయించాలి.
- 10,16 సంవత్సరాలు పూర్తియితే టెట్నాస్(టీటీ) వేయించాలి
- 9 నెలల నుంచి 5 ఏళ్ల వయస్సు వరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్–ఏ చుక్కలు మొత్తం 9 డోసులు వేయించాలి..

> **టీకాలు తప్పనిసరిగా వేయించాలి**
>
> గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటి వల్ల ప్రాణాంతకవ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రాణీ ప్రాంత ప్రజల్లో టీకాలపై తమ సిబ్బంది ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం, ప్రజలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలు సద్వినియోగం చేసుకోవాలి.
>
> – విష్ణువర్ధన్ వైద్యాధికారి పామర్రు పీహెచ్‌సీ

అన్నదాత సుఖీభవ పథకం సొమ్ములు చెల్లించాలి

కాజులూరు: ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఇస్తామన్నా రూ.20 వేలును వెంటనే వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమచెయ్యాలని రైతుసంఘాల నాయకుడు తణుకువాడ పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మెన్ తాడి వెంకట రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో గద్దెనెక్కెందుకు కూటమి నాయకులు అన్ని వర్గాల ప్రజలకు అనేక హమీలిచ్చి అధికారంలోకి వచ్చాకా హమీలన్ని తుంగలోకి తొక్కారన్నారు. ముఖ్యంగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకంతో యేటా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారని అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికీ ఒక్క రుపాయి ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం మండలంలో రైతులు తొలకరి సాగు పనులు నిర్వహిస్తున్నారని పెట్టుబడులకు సొమ్ములు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని పథకాన్ని వెంటనే అమలు చెసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పోలినాటి సూర్యచంద్రం, టేకుమూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం



వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహారావు, శిల్పి రాజ్‌కుమార్

కొత్తపేట: తనయుడిని ఓ డాక్టర్‌గా చూడాలనుకున్న తల్లిదండ్రులు ఆ తనయుని స్మృతిలో ఉచిత వైద్య, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆరు జిల్లాలు) ఎస్పీ డాక్టర్ కొండా నరసింహారావు అన్నారు. స్థానిక వెంకట సందీప్ 'ఐ' క్లినిక్ ప్రాథమిక కంటి ఆసుపత్రి వద్ద ఆదివారం ఫ్రీ 'బోన్ మినరల్ డెన్సిటీ' అండ్ 'ఐ' క్యాంపు నిర్వహించారు. సందీప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండారు పెదవెర్రియ్య (చిట్టిబాబు) – సత్యవేణి దంపతుల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం యూనివర్సల్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎస్పీ నరసింహారావు ప్రారంభించారు. ఎముకలు, కీళ్ల వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ రాజేంద్రబాబు ఆరుమిల్లి ఆధ్వర్యంలో బోన్ మినరల్ డెన్సిటీ టెస్ట్ ఉచితంగా చేశారు. ఈ సేవలను 165 మంది వినియోగించుకున్నారు. వెంకట సందీప్ 'ఐ' క్లినిక్ ప్రాథమిక కంటి ఆస్పత్రి ద్వారా ఐ స్పెషలిస్టు డాక్టర్ అఖిల 128 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 22 మందిని ఆపరేషన్ అవసరమని గుర్తించి రాజమహేంద్రవరం అకీరా కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రస్ట్ సభ్యులు వలంటరీ సేవలు అందించారు.

శ్రీనివాస్ ప్రభూజీ సేవలు అభినందనీయం

అయినవిల్లి: నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకులు శ్రీమాన్ సుందర శ్రీనివాస్ ప్రభూజీ అందిస్తున్న సేవలను మందిర్ స్థల దాత, పారిశ్రామిక వేత్త గణేశుల వేంకటేశ్వరరావు దంపతులు అభినందించారు. ఆదివారం శ్రీకృష్ణమందిర్‌లో శ్రీమాన్ సుందర శ్రీనివాస్ ప్రభూజీని శాలువా వేసి సత్కరించారు. సుందర శ్రీనివాస్ ప్రభూజీ శ్రీకృష్ణ తత్వంను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిసరాలలో చాటి చేబుతున్నారన్నారు. నల్లచెరువు గ్రామంలో రూ. కోట్లతో సుందరంగా శ్రీకృష్ణ మందిర్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. అందుకు దాతల సహకారం తీసుకుంటున్నారన్నారు.